రక్షా బంధం

ఘనంగా రాఖీ వేడుకలు | కేటీఆర్‌కు రాఖీలు కట్టిన మహిళా నేతలు

సోదరసోదరీమణుల ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్, నేను నీకు రక్ష.. అంటూ సోదరికి అభయమిచ్చే వేడుక. సోమవారం ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గాల వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు కోలాహలంగా సాగాయి. అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలువురు మహిళలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సైదాబాద్/ఎల్బీనగర్, ఆగస్టు 19: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఐఎస్ సదన్, సైదాబాద్ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు సామ స్వప్నా సుందర్ రెడ్డి, సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా సైదాబాద్ రెడ్డిబస్తీలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు రవీందర్ రెడ్డికి రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు దశరథ లక్ష్మి, భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి, సంధ్య, స్వప్న, రుక్మిణీ, తులసీ, పావనీ, అనురాధ తదితరులు పాల్గొని రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సైదాబాద్ జువైనల్ హోంలోని చిన్నారులకు బీజేపీ నాయకురాలు కొంపెల్లి మాదవీలత రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

అనుబంధాల వేడుక..

బడంగ్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, బీఆర్ఎస్ పార్టీ మీర్‌పేట అధ్యక్షురాలు జలాల్పూర్ సునీత బాల్‌రాజ్, కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు పెద్ద సంఖ్యలో కేటీఆర్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్..

ఆర్కేపురం: ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని చిలుక ఉపేందర్‌రెడ్డి నివాసంలో ఆదివారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రాఖీ పౌర్ణమి వేడుకల్లో చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కడుతున్న సైదాబాద్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి

భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డికి మహిళా మోర్చా నాయకులు

సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రవీందరెడ్డికి రాఖీలు కడుతున్న మహిళా మోర్చా కార్యకర్తలు

కర్మన్‌ఘాట్‌లో అన్నా తమ్ముళ్లకు రాఖీ కడుతున్న చిన్నారులు. – చంపాపేట

నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీకి రాఖీలు కడుతున్న మహిళానేత దశరథ లక్ష్మి తదితరులు

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి. – మన్సూరాబాద్

జేహెచ్‌డీ డిప్యూటీ డైరెక్టర్ మిర్జా రజాక్ అలీ బేగ్‌కు రాఖీ కడుతున్న మాధవీలత

బడంగ్‌పేటలో అన్నయ్య భారత రత్నకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు సత్య అన్వేషణ, సత్య శోధన

జిల్లెలగూడలో తమ్మునికి రాఖీ కడుతున్న చెల్లెలు

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

ఆర్కేపురం, ఆగస్టు 19: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ ఆర్కేపురం డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఆవరణంలో ఘనంగా గాయత్రి హోమం, గాయత్రి ధారణ, సామూహిక రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత హాజరై మాట్లాడుతూ.. 25 సంవత్సరాల నుంచి రక్షా బంధన్ దినోత్సవాన్ని ఎల్బీనగర్ దేవాలయంలో నిర్వహించామని, ఆర్కేపురంలో పద్మశాలి కుల బంధువులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో ఇక్కడ నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే నెల 20న ఆటోనగర్‌లోని డీర్ పార్క్ ఆవరణలో 22వ పద్మశాలి దసరా మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విడెం సుదర్శన్, కౌకుంట్ల బాలయ్య, ఆర్కేపురం సంఘం గౌరవ అధ్యక్షులు కౌకుంట్ల రవితేజ, తలాటి రమేశ్, జెల్ల జగన్నాథం, బొమ్మ రఘురాం, వేముల రాము, కర్నాటి శ్రీనివాస్ గడ్డం లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

గాయత్రి హోమంలో పాల్గొన్న పున్న గణేశ్‌నేత, కౌకుంట్ల రవితేజ

యువతి అదృశ్యం

స్వాతి (ఫైల్)

మలక్‌పేట, ఆగస్టు 19: యువతి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసారాంబాగ్ సాయి నగర్‌కు చెందిన సీహెచ్.సుదర్శన్, భూదేవి దంపతుల కూతురు స్వాతి(19) ఈ నెల 14న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కెమెరా సృష్టికర్త లూయిస్ డ్యాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, ఆగస్టు 19: సుందర దృశ్యాలను తన కెమెరాలో బంధించి కళాత్మకమైన చిత్రాలను ప్రజలకు పరిచయం చేయడంలో ఫొటోగ్రాఫర్ల భూమిక మరువలేనిదని నాగోల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంను పురస్కరించుకుని నాగోల్‌లో సోమవారం నాగోల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డ్యాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహదవ్, మల్లికార్జున్, కిషన్, లక్ష్మిదాస్‌గౌడ్, సుభాష్, నర్సింహ గౌడ్, రమేశ్, సాయికృష్ణ, జంగయ్య, ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని చాటి చెప్పేదే తీజ్ పండుగ

బంజారా బస్తీలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్న చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి

ఆర్కేపురం, ఆగస్టు 19: గిరిజన సంస్కృతిని చాటి చెప్పేది తీజ్ పండుగ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బంజారా బస్తీలో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ దండి మేరమ్మ పండుగ మహోత్సవం, శీత్ల పండుగ, తీజ్ పండుగ వేడుకలకు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరువు నుంచి కాపాడే ప్రకృతి పండుగ తీజ్ అని పేర్కొన్నారు.

పేదల పెండ్లిళ్లకు ఉప్పల చేయూత

నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, ఆగస్టు 19: నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనిచ్చింది. సికింద్రాబాద్, వారాసిగూడకు చెందిన కోమటి వరలక్ష్మి, సత్యనారాయణ కుమార్తె రేఖ వివాహంతో పాటు సిద్దిపేట జిల్లా తడ్కపల్లి గ్రామానికి చెందిన అల్లిమల్లి సుజాత, పరశురాములు కుమార్తె అనూష వివాహాలు ఇటీవల నిశ్చయమయ్యాయి. సదరు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కొందరు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం రేఖ, అనూష వివాహాలకు గాను ఇరువురి కుటుంబసభ్యులకు వేర్వేరుగా పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ క్యాక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, రమేశ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవికి లక్ష గాజుల పూజ సేవ

అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు, పుస్తెల తాడును అందజేస్తున్న ఎన్ఆర్ఐ భక్తులు శ్రీతరుణ్, గాయత్రి అభినిక దంపతులు


లక్ష గాజుల అలంకరణలో ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారు

ఆర్కేపురం, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలోని దేవతలకు సోమవారం లక్ష గాజుల పూజ సేవ కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని మొత్తం రంగు రంగుల గాజులతో అలంకరించారు. విశేష అభిషేకం తదనంతరం అమ్మవారికి గాజుల పూజ సేవా జరిగింది. ఎన్ఆర్ఐ భక్తులు శ్రీతరుణ్, గాయత్రి అభినిక దంపతులు అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు, పుస్తెలతాడు సమర్పించారు. రాకిఫౌర్ణమి కావడంతో వేలాది మంది భక్తులకు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ, హేమంత్, అరుణ, హేమ, శ్రీపతి, సాయికుమార్, అశ్వంత్‌రామశర్మ, కనకపల్లి తదితరులు ఉన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డి.సర్వయ్య

ఎల్బీనగర్, ఆగస్టు 19: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారతదేశ వ్యాప్తంగా ఆగస్టు 21న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డి.సర్వయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలు, మాల ఉప కులాలు సంఘటితంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మాల, మాల ఉప సంఘాల నాయకులు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కలిసికట్టుగా స్వచ్ఛందంగా భారత్ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాలల సత్తాను ప్రభుత్వానికి తెలిసే విధంగా, కేంద్రంలోని మోదీ సర్కార్‌కు తగిన రీతిలో తెలిసే విధంగా ప్రణాళికాబద్ధంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని చేద్దామన్నారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీలను వర్గీకరించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని, వారి ఆగడాలను సాగనివ్వమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే శక్తులందరినీ కూడగట్టి భారత్‌బంద్‌లో భాగస్వాములను చేయాలని కోరారు.

శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

మాట్లాడుతున్న మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్

మలక్‌పేట, ఆగస్టు 19: శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ సూచించారు. సోమవారం మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో మైత్రీ, పీస్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ఉత్సవకమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. పోలీసుల సూచనలను మండపాల నిర్వాహకులు పాటించాలని చెప్పారు. ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, ఎస్ఐలు నవీన్, సురేశ్, పోలీసు సిబ్బంది, మండపాల నిర్వాహకులు, మైత్రీ, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

మలక్‌పేట, ఆగస్టు 19: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించేలా ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ సమాజం బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ మూసారాంబాగ్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మూసారాంబాగ్ చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ మారుతీ మందిర్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, మూసారాంబాగ్ కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, మూసారాంబాగ్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నింగప్ప (ఫైల్)

మలక్‌పేట, ఆగస్టు 19: వ్యక్తి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లాకు చెందిన నడిమిదొడ్డి నింగప్ప(41) ఈనెల 16న మూసారాంబాగ్‌లోని ఓ ఫంక్షన్‌కు వచ్చి అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

హనుమాన్ ఆలయంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన రేకుల షెడ్లను ప్రారంభిస్తున్న చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

చంపాపేట, ఆగస్టు 19: ధ్యానాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించి సహకరించిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి తెలిపారు. కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా దాతలు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అనురాధ దంపతుల సహకారం రూ.1.20లక్షలతో వినాయక స్వామి, కేదర్ హనుమాన్ ఆలయం వెనుక రేకుల షెడ్డు, శ్రీసాయి బాలాజీ గ్రూప్ అధినేత ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతుల సహకారంతో ప్రధాన ఆలయం ముందు రూ.10లక్షల వ్యయంతో రఫ్ గ్రానేట్ ఫ్లోరింగ్, ఎడవెల్లి బాల్‌రాజ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్ సహకారంతో కోనేరు ముందు రూ.6లక్షల వ్యయంతో రేకుల షెడ్డు నిర్మాణం, దాత జూల యాదగిరిరెడ్డి అందించిన రూ.2లక్షల సహకారంతో రథశాల షెడ్డు, పోతులూరి శిరీష రాజశేఖర్ రెడ్డి అందించిన రూ.2లక్షలతో వంటశాల ఆధునీకరణ, ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్ గౌడ్, మేకల యాదగిరి అందించిన రూ.6లక్షలతో జగన్నాథ స్వామి ఆలయ ఆవరణలో సిరామిక్ టైల్స్, బొక్క అరుణ రాంరెడ్డి అందించిన రూ.75వేలతో పాదరక్షల స్టాండ్ ఏర్పాటు మొత్తంగా రూ.27లక్షల వ్యయంతో ఆలయంలో విస్తారంగా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో సోమవారం పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులతో కలిసి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలందరికీ అభినందనలు తెలిపారు. స్వామివారి అనుగ్రహానికి పాత్రులై భక్తులు ఆలయ అభివృద్ధికి విరివిగా విరాళాలు అందజేస్తున్నారని అన్నారు. దాతల సహకారంతోనే ఆలయం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, ధర్మకర్తలు మధుసాగర్, గోగిరెడ్డి అంజిరెడ్డి, బీపుకుంట్ల సతీశ్ గౌడ్, చీర తిరుమలేశ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సలీంనగర్‌లోని గణపతి దేవాలయంలో చండీ హోమం

చండీ హోమంలో పాల్గొన్న మహిళా భక్తులు

మలక్‌పేట, ఆగస్టు 19: సలీంనగర్‌లోని గణపతి దేవాలయంలో శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై చండీ మాతకు కుంకుమార్చన, లక్ష పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీపురం కృష్ణారెడ్డి, లక్ష్మి దంపతులు, కళావతి, రాజేశ్వరీ, వనజ, వసంత, పద్మజ, రజనీ పాల్గొన్నారు.

సరూర్‌నగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా కొండా రాజేశ్

ఆర్కేపురం, ఆగస్టు 19: సరూర్‌నగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా కొండా రాజేశ్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా త్రివేణి నియమితులయ్యారు. ఈ మేరకు సరూర్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి సురేశ్ ముదిరాజ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.